హిందూ, ఈ పెళ్ళి ఎలా జరుగుతుందనుకున్నావు- నీవాళ్ళు ఒప్పుకుంటారా- అసలు రజియాని నీవు పెళ్ళిచేసుకుంటావని మాకేం నమ్మకం?" అనుమానంగా అడిగాడు.

"కుల మతాల ప్రసక్తి నాకు లేదు- మావాళ్ళు ఒప్పుకోరు. కాని రజియా కోసం వాళ్ళని ధిక్కరించగలను- నా బ్రతుకు నేను బ్రతకగలను- రజియాని పెళ్ళి చేసుకుంటానో లేదోనని మీ కనుమానం వుంటే యీ క్షణంలోనే మీ అందరూ కలసి పెళ్ళి జరిపించండి" అన్నాను దృఢంగా.

"వీల్లేదు- రజియా హిందూని పెళ్ళాడడానికి వీలులేదు - అసలు మా బావ మరిదితో రజియాకి పెళ్ళి కుదిరిపోయింది - మాటిచ్చేశాను" అరిచాడు అన్నయ్య.

ఆ మాటకి రజియా చురుక్కున తీక్షణంగా చూసింది. అంతదాకా వచ్చాక ఆమె అన్నకి భయపడాల్సింది కనపడలేదు - పక్కన నేను అండగా వున్నాననీ గాబోలు-

"వాడా, ఆ తాగుబోతు, ముండలముఠాకోరుని నేను చచ్చినా పెళ్ళాడను అన్నయ్యా - పాపం నీకు ఎప్పుడూ చెల్లెలిమీద లేని అభిమానం యిప్పుడు మాత్రం ఎందుకు- ఏనాడు అన్నగా బాధ్యత నెరవేర్చని నీకు నాపెళ్ళి బాధ్యతా అనవసరం. నీవు వదిన కలిసి ఆ రౌడీకి నన్ను కట్టబెట్టి వాడి దగ్గరనించి డబ్బులాగాలని చూస్తున్నావని నాకు తెలుసు-నా కంఠంలో ప్రాణం వుండగా చేసుకోను నా పెళ్ళినాయిష్టం వచ్చినవాడితో చేసుకొనే హక్కు నాకుంది.' తీక్షణంగా చూస్తూ తెగేసి చెప్పింది. అన్న మొహంలో రక్తం పొంగింది.

"నీకెంత ధైర్యం-నీవు వీడ్ని ఎలా పెళ్ళాడతావో చూస్తాను-" బుస కొట్టాడు.

"చూడు బాగా చూడు-ఇదంతా చెల్లెలిమీద ప్రేమ కాదని, నీయింట్లో దాసీగా వుంచుకోడానికి దొరికిన అవకాశం యిలా చెయ్యి జారిపోతుందని, నాపెళ్ళిద్వారా వచ్చే డబ్బురాదని నీ భయం-నీలాంటి నీచుడు నాకు అన్న అని చెప్పుకోడానికే అసహ్యం-నేను యీయనతో వెడుతున్నాను-నాదారికి అడ్డంవస్తే పర్యవసానం బాగుండదు-పదండి వెడదాం"

"రజియా బేటీ బాగా ఆలోచించుకున్నావా-పెళ్ళికాకముందే ఒకడితో వెళ్ళడం

మంచిదికాదు. ముసలివాడు అన్నాడు.

"బాబాయ్–అన్నదగ్గరవుండి భరించే హింసకంటె–యీయనతో పెళ్ళి ఏ నిష్ఠుర మైనా భరిస్తాను–ఆయనమీద నాకామాత్రం నమ్మకం వుంది—" అంది రజియా స్థిరంగా రజియాకి నామీదవున్న నమ్మకానికి ఆనందించాను–రజియా చేయి నాచేతిలోకి తీసుకుని అందరివంక తిరిగి–"మీ అల్లా సాక్షిగా, మీ అందరి సాక్షిగా రజియా యీ క్షణంనించి నా భార్య–అన్నాను–ముసలతను ఒక్క–క్షణం సందేహించి రజియాబేటీ యీ పెళ్ళి నీకు సమ్మతమేనా– అల్లా సాక్షిగా యితన్ని నీవు భర్తగా అంగీక రిస్తావా అన్నాడు– రజియా సిగ్గుగా తల ఊపింది. ముసలతను "నసీర్, రజియా యిష్టపడినపుడు యింక నీవు చేసేదేంలేదు– రజియా అన్నట్లు "నీవు ఎప్పుడూ మీ అమ్మ, రజియాల భారం స్వీకరించలేదు. పెళ్ళి విషయంలో మాత్రం ఎందుకు ఆమె యిష్టం వచ్చిన వాడిని చేసుకుంటుంది.' అన్నాడు. తరువాత ముసలతను మా ఇద్దరు చేతులు కలిపి ఏవో మనస్సులో చదివాడు– తరువాత మా కోసం మోకరిల్లి నమాజు చేశాడు– ఓ ముసలావిడ వచ్చి రజియా చీరకొంగు తీసి రజియాకి ముసుగు వేసింది. ముసలాయన ప్రార్థన పూర్తి చేసి "ఈ క్షణం నుంచి అల్లా సాక్షిగా మీరు భార్యా భర్తలు– వెళ్ళండి అల్లా మీకు శుభం కలుగ చేస్తాడు' అన్నాడు– రజియా వంగి అతనికి నమస్కరించింది– తరువాత అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా రజియాని చేయి పట్టుకుని నడిపించుకుని బయిటికి తీసుకు వెళ్ళాను– అన్న నిస్సహాయంగా బుసలు కొట్టాడు.

"మీరు తొందర పడలేదు గదా– నామీద జాలితో తొందరపడి చేసుకున్న నిర్ణయం కాదు గదా– అంది రజియా రైలులో వెడుతుండగా– 'నేను తొందపడి చేసుకున్న నిర్ణయంగా మాత్రమే నీకని పిస్తూందా రజియా అన్నాను మృదువుగా. ఈ రెండు మూడు నెలలుగా నన్ను చూస్తున్న నీకు నా మనసేమిటిదో తెలియదా ?'

"అదికాదు–అదికాదు–మనమధ్య వున్న అంతరాలు, జాతి–మతం – కులం మీ వంశం, గౌరవం, ప్రతిష్ఠ–వీటన్నింటి గురించి ఆలోచించలేదేమోనని అంది రజియా. "వీటన్నింటిని గురించి రెండునెలలుగా ఆలోచిస్తూనే వున్నాను రజియా–నీ కోసం వీటన్నింటిని వదులుకోగలను" నిబ్బరంగా అన్నాను.

"కానీ మీవాళ్ళు నన్ను అంగీకరిస్తారా" సందేహంగా చూసింది రజియా.